ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 16 మే 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 34 (గురువారం)

కనిష్ఠం : 28

సామర్లకోట చైర్‌పర్సన్ పదవికి రాజీనామా 7

రోడ్డెక్కిన రైతులు





అయినవిల్లి మండలం ముక్తేశ్వరం సెంటర్‌లో ధాన్యం ట్రాక్టర్లతో రహదారిని దిగ్బంధించిన రైతులు, (పక్కన) రైతులతో కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో చర్చలు జరుపుతున్న డీఆర్వో రాజకుమారి

- ధాన్యం కొనుగోలు కోసం రోడ్డెక్కిన రైతులు
- కలెక్టరేట్ వద్ద ధాన్యం లోడ్లు ఉంచి నిరసన
- రైతులతో డీఆర్వో రాజకుమారి చర్చలు
- టార్గెట్లు పూర్తికాని ఆర్ఎస్కేల ద్వారా కొనుగోలుకు హామీ
- నిరసన విరమణ

అమలాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): రబీ సాగులో ఎంతో కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలను నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. పండించిన ధాన్యాన్ని ట్రాక్టర్లపై వేసుకుని ఆందోళనకు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ట్రాక్టర్లు తీసుకువచ్చి కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. అంతకుముందు మండల కేంద్రమైన ముక్తేశ్వరం సెంటర్‌లోని మెయిన్ రోడ్డు జంక్షన్‌లో ధాన్యం ట్రాక్టర్లతో రహదారిని దిగ్బంధించి తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. అయితే పోలీసులు ముందస్తుగానే ట్రాక్టర్లను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా రోడ్డు పక్కనే నిలిపివేయించారు. తరువాత ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులతో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి సంప్రదింపులు జరిపి ధాన్యం కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీతో రైతులు అక్కడి నుంచి నిష్క్రమించారు. ప్రభుత్వం ఆర్ఎస్కేల ద్వారా ధాన్యం సేకరణ కొన్ని ప్రాంతాల్లో పూర్తి అయిందని, కొన్ని గ్రామాలు అసలు టార్గెట్ ఇవ్వకుండా కొనుగోలు చేయక పోవడంతో రైతులు రోడ్డెక్కారు. సుమారు 13 ట్రాక్టర్ల ధాన్యం లోడుతో రైతులు తొలుత ముక్తేశ్వరం సెంటర్‌లో రహదారిని దిగ్బంధించి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ట్రాక్టర్లు ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు వస్తున్నాయన్న సమాచారంతో పట్టణ సీఐ వీరబాబు స్పందించి ముందుగానే కలెక్టరేట్ వద్దకు చేరుకుని వాటిని రోడ్డు పక్కనే నిలిపివేయించారు. ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులతో మాట్లాడి డీఆర్వోతో చర్చలకు ఏర్పాటుచేశారు. దాంతో డీఆర్వో రైతు ప్రతినిధులతో పాటు వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. రైతుల కష్టాలు విన్న డీఆర్వో రాజకుమారి మాట్లాడుతూ టార్గెట్లు పూర్తికాని ఆర్ఎస్కేల సమాచారం తీసుకుంటామని, అక్కడకు వెళ్లి మీ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చునని భరోసా ఇవ్వడంతో రైతులు ఉపశమనం పొందారు.



బహిరంగ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలును ప్రోత్సహించండి : జేసీ నిషాంతి

అమలాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం సేకరణలో ప్రభుత్వ టార్గెట్‌తోపాటు బహిరంగ మార్కెట్‌కు ప్రోత్సహిస్తూ గిట్టుబాటు ధరల కల్పనకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ అమలులో రైతులకు సహకరించని సిబ్బందిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయశాఖ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఆమె చర్చించారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ టార్గెట్లు స్థానిక ఉత్పత్తుల్లో 49 శాతమే ఉన్నందున బహిరంగ మార్కెట్‌ను మిల్లర్లతో సమన్వయంచేసి ప్రోత్సహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నిషాంతి ఆదేశించారు. మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను రోజువారీగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి అడపా ఉదయ్‌భాస్కర్, మేనేజర్ బాలసరస్వతి, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ఏడీలు నాగేశ్వరరావు, వెంకటరామారావు పాల్గొన్నారు.



విజయవాడలో రైల్వే డీఆర్ఎం, చీఫ్ ఇంజనీర్లను కలిసి చర్చిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్

రైల్వే భూసేకరణకు సానుకూల స్పందన

- డీఆర్ఎంతో ఎంపీ హరీష్ భేటీ
- ద్వారపూడి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

అమలాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణకు మార్గం సుగమం అయింది. రైల్వేలైన్ భూసేకరణతోపాటు కోనసీమ జిల్లా పరిధిలోని ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక సౌకర్యాల కల్పనకు రైల్వే ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్టు అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్ తెలిపారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌పై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రగతి ఏది.. శీర్షికన వార్తాకథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ఎంపీ హరీష్‌మాధుర్ గురువారం విజయవాడలోని దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ ఇంజనీర్లతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. రైల్వేలైన్ భూసేకరణకు సంబంధించిన అంశాలపై అధికారులకు వివరించారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, నష్టపరిహారం విషయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు న్యాయం జరిగే రీతిలో నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ఎంపీ డిమాండ్ చేశారు. భూ సేకరణకు సంబంధించి అవార్డులు జారీ, పరిమారం చెల్లింపు, క్లియరెన్స్ ప్రక్రియ వేగవంతం చేయాలని కేంద్రస్థాయిలో ఇప్పటికే రైల్వేమంత్రిత్వశాఖ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాల్సిందిగా రైల్వే డీఆర్ఎంను, చీఫ్‌ఇంజనీర్లను కోరారు. అలాగే ప్రయాణికుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ద్వారపూడి రైల్వేస్టేషన్ సౌకర్యాల కల్పనపై అధికారులతో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి ద్వారపూడి రైల్వేస్టేషన్‌కు పంపిస్తామని, వారు ఇచ్చే సూచనల మేరకు ద్వారపూడి స్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రైల్వే ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్టు హరీష్‌మాధుర్ తెలిపారు.



కొత్త కార్డుకు కష్టాలు

నిబంధనాలు

కూటమి ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది.దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మ్యాపింగ్ తంటా..

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్దేశించింది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

(పిఠాపురం- ఆంధ్రజ్యోతి)

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. అందులో కుటుంబసభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇది తప్పనిసరి కాదని మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినా అది లేకుండా దరఖాస్తు తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. తాజాగా ఆశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ప్రకటించారు. ఇక బయోమెట్రిక్స్ పడకపోయినా దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలిముద్రలు పడని వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి నెలకొంది.

- నూతన రేషన్‌కార్డులకు ఆన్‌లైన్‌లో అవస్థ
- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- నాటి హౌస్‌మ్యాపింగ్‌లో పలు లోపాలు
- కొత్త కార్డుల జారీకి అదే ప్రామాణికం
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు తంటాలు
- అవసరం లేదంటున్న మంత్రి నాదెండ్ల
- బయోమెట్రిక్స్ పడకుంటే నో ఛాన్స్
- ఓటీపీ ఆప్షన్ డిజేబుల్
- రేషన్‌కార్డు దరఖాస్తు ఉచితం
- రూ.100 వసూలు చేస్తున్న సిబ్బంది
- సచివాలయాల్లో దరఖాస్తులకు పాట్లు

నిబంధనలు సడలించాలి..

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నిబంధన తొలగించడంతోపాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలని, మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించి వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్‌లైన్ చేసే అవకాశం కల్పించాలని, బయోమెట్రిక్స్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న ఎంతమందైనా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

దరఖాస్తు చేయాలంటే రూ.100

రేషన్‌కార్డు దరఖాస్తు ప్రభుత్వం ఉచితమని ప్రకటించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని ఒక సచివాలయంలో దరఖాస్తుదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది.

మ్యారేజ్ సర్టిఫికెట్ అక్కర్లేదు!

కొత్తగా కార్డు పొందడానికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారిలో 95 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ప్రకటించారు.

బయోమెట్రిక్స్...

కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడనివారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

విభజనలో కొత్త కష్టాలు

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది.

- మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో పేరు కుటుంబంలో చేర్చకున్నా భార్యపిల్లలకు కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

ఆధార్ చిరునామాతోనే...

- ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్‌లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది.
- చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.







రావులపాలెంలో ఈదురుగాలులతో కూడిన వర్షం.. (పక్కన) ముంగండలో తడిసిన ధాన్యం బస్తాలు.. అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో నిలిచిన నీరు

భారీ వర్షం!

- ఈదురుగాలులతో కూడిన వాన
- అన్నదాతలకు నష్టం
- వేసవి నుంచి ఉపశమనం పొందిన ప్రజలు

అమలాపురం/పి.గన్నవరం/మామిడికుదురు/అంబాజీపేట/రావులపాలెం, మే 15(ఆంధ్రజ్యోతి): మండే ఎండలతో మలమల మాడిపోతున్న ప్రజలకు ఉపశమనమిచ్చింది భారీ వర్షం. కోనసీమ జిల్లావ్యాప్తంగా గురువారం పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో పలుచోట్ల చెట్లు కుప్పకూలాయి. దాంతో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తరువాత ప్రారంభమైన వర్షం 45 నిమిషాలపాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. మళ్లీ సాయంత్రం 4.30 గంటల నుంచి గంట సేపు కురిసిన భారీ వర్షంతో అమలాపురం పట్టణంలోని పలు పురవీధుల్లో వర్షపు నీరు పొంగి ప్రవహించింది. కానీ అన్నదాతలు మాత్రం తీవ్రంగా నష్టాలు చవి చూస్తున్నారు. ఎక్కడికక్కడే కళ్లాల్లో, బస్తాల్లోను రాశులుగా పోసిన ధాన్యం వర్షపు నీటికి తడిసి ముద్దయింది. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో అన్నదాతలకు ఈ వర్షాలు మరింత చేటు తెచ్చాయి. అమలాపురం రూరల్ మండలం సమనసలో చెట్లు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అల్లవరం మండలం తూర్పులంకలో పిడుగుపాటుకు ఒక తాటాకిల్లు దగ్ధమైంది. పలుచోట్ల రహదారుల చెంతన ఉన్న చెట్లు కూడా నేలనంటాయి. పలుచోట్ల భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు సుమారు ఆరుగంటలపైనే అంతరాయం కలగడంతో అమలాపురంతోపాటు కోనసీమ వ్యాప్తంగా పలువురు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పి.గన్నవరం మండల పరిధిలోని గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని పి.గన్నవరం హైస్కూల్, మొండెపులంక, లంకలగన్నవరం తదితర ప్రాంతాల్లో చెట్లు కరెంటు తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే ముంగండలోని కొక్కిరి త్రిమూర్తులు, నేలపూడి బాబులు అనే కౌలు రైతుల ధాన్యం బస్తాలు చేలో ఉండిపోవడంతో తడిసిపోయాయి. మామిడికుదురు మండలంలో పండిన పంట చేతికి వచ్చి సొమ్ము చేసుకునే సమయంలో అకాల వర్షం తమను నట్టేట ముంచిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇక చేలల్లో ఉన్న వరి పనలను మోపులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. గురువారం కురిసిన వర్షం దాళ్వా రైతులను నట్టేట ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాయుగుండం ప్రభావంతో మరొక మూడు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ ధాన్యాన్ని త్వరితగతిన కొనేలా చూడాలని కోరుతున్నారు. ఇక అంబాజీపేట మండలంలోనూ ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో రావడంతో అన్నదాతలు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా రహదారులు జలమయమయ్యాయి. ధాన్యం రాశులపై బరకాలు కప్పేందుకు రైతులు పరుగులు తీశారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు విరిగిపడిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రావులపాలెం మండలంలో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా రెండు గంటలపాటు వర్షం కురవడంతో ఒక పక్క వేసవి తాపం నుంచి ప్రజలు ఉపశమనం పొందగా, కల్లాల్లో ధాన్యం కొంతమేర తడవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఏపీ ఈసెట్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అబ్దుల్ రజాక్‌కు రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు 6

టాప్ టెన్‌లో..

- ఉమ్మడి జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలకు ఉత్తమ ర్యాంకులు
- కోనసీమకు ఏడో స్థానం

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- టెన్త్ సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు : డీఈవో సలీంబాషా



పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అంబాజీపేట, మే 15(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టారు. ఈనెల 19వ తేదీ నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ఆదేశాల మేరకు 10 పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను ఏర్పాటుచేశారు. జిల్లాలో ఈ ఏడాది 232 మంది హైస్కూళ్లలో 18892 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా, 17,204 మంది వివిధ గ్రేడ్లలో ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. అయితే 1688 మంది రెగ్యులర్‌తోపాటు 203 మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవ్వడంతో వీరు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 10 కేంద్రాల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తుండగా, వీటిలో అమలాపురంలో 3, రామచంద్రపురం 2, మలికిపురం, రాజోలు, కొత్తపేట, రావులపాలెం, మండపేట పాఠశాలల్లో ఈ తరగతులను నిర్వహిస్తున్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ, ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు అయినా విద్యాశాఖ ఆదేశాలతో ప్రత్యేక తరగతులను నిర్వహించి పనిచేస్తున్నారు. పది పరీక్ష తప్పిన వారంతా ఉత్తీర్ణత కావాలనేది ప్రధాన లక్ష్యమని, దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమీక్ష చేస్తున్నాం. ప్రతి విద్యార్థిపైన ప్రత్యేక దృష్టిపెట్టి ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ ఏడాది ఉత్తీర్ణత సాధించి పైచదువులకు వెళ్లేలా విద్యాశాఖ కసరత్తు చేస్తున్నట్టు తెలియజేశారు.



ప్రజారోగ్యానికి
దోమలే ప్రథమ శత్రువు

- సగం అనారోగ్య సమస్యలకు ఇవే మూలం
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే డెంగ్యూ దూరం
- గడిచిన పదేళ్లలో డెంగ్యూ వ్యాధి తగ్గుముఖం
- వ్యాది నిర్ధారణ కేంద్రాలు మరిన్ని అవసరం
- మాక్-ఎలీసాదే తుది నిర్ధారణ పరీక్ష
- నేడు జాతీయ డెంగ్యూ అవగాహన దినం

(పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి)

'పరిశీలించండి...శుభ్రం చేయండి....మూతలు పెట్టండి అనే మూడు పద్ధతుల ద్వారా డెంగ్యూను పూర్తిగా ఓడించండి' ఇదీ వైద్య ఆరోగ్యశాఖ నినాదం. ఎందుకంటే దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులుగా భావించవచ్చు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మొదడువాపు, జికా వంటి ప్రధాన వ్యాధులు వ్యాపిస్తాయి. అయితే ప్రజల్లో డెంగ్యూ వ్యాధి గురించి ప్రత్యేక అవగహన కార్యక్రమాలు, నివారణ చర్యలపై దృష్టిపెట్టడం వంటి ప్రధాన లక్ష్యంతో గత పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం డెంగ్యూ వ్యాధిని తగ్గించడంలో గణనీయమైన ప్రగతిని సాధించిందని చెప్పవచ్చు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో డెంగ్యూ లక్షణాలు ఉన్నప్పటికీ తీవ్రత అంతగా ఉండడం లేదని వ్యాధి త్వరితగతిన అదుపులోకి వస్తోందని వైద్యాధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కర్నూలు, నంద్యాల, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ జిల్లాల్లో మాత్రమే డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయని అధికారికంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇంటి చుట్టుపక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో చూడడంతోపాటు నీటి నిల్వలను శుభ్రం చేసి నీరు నిల్వ ఉండే తొట్టెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉంచితే దోమలు వ్యాపించవు. తద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చు. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 2023లో 84 డెంగ్యూ కేసులు నమోదుకాగా, 2024లో అత్యధికంగా 239 డెంగ్యూలు కేసులు నమోదయ్యాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటివరకు 11 కేసులు మాత్రమే నమోదయ్యాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేటు ఆసుపత్రుల్లో చేసిన పరీక్షలు పరిగణనలోకి తీసుకోబోమని, ఆ పరీక్షలతో డెంగ్యూ నిర్ధారణ కాదని మాక్-ఎలీసా పరీక్షే డెంగ్యూ నిర్ధారణగా భావించవచ్చని ఆరోగ్యశాఖ స్పష్టం చేస్తోంది.

డెంగ్యూ వ్యాధి లక్షణాలు..

డెంగ్యూను పరిశీలిస్తే.. సాధారణంగా మన ఇళ్ల పరిసరాల్లో అనాఫిలస్, క్యూలెక్స్, ఏడిస్, మాన్సోనియా అర్మిజరిస్ దోమలు పెరుగుతాయి. డెంగ్యూ అనేది వైరల్ జ్వరం, ఇది ఏడిస్ అనే దోమకాటు వల్ల వ్యాపిస్తుంది. ఈ ఏడిస్ దోమ ముఖ్యంగా పగటిపూట కుట్టే దోమ. ఒక్కసారిగా అధిక జ్వరం, తలనొప్పి, కంటివెనుక భాగంలో నొప్పి, కండరాలు నొప్పులు, జుట్టు ఊడిపోవడం, చర్మంపై గుండ్రటి ఎర్రమచ్చల లక్షణాలు కనిపిస్తాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం సెంటినల్‌సైట్ హాస్పటల్, రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రుల్లో మాత్రమే డెంగ్యూ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ రెండిటితోపాటు కాకినాడ, రాజమహేంద్రవరం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులు (జీజీహెచ్‌లు), తుని ఏరియా ఆసుపత్రిల్లో డెంగ్యూ నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. రోగి రక్త నమూనాలను మొదట ఎన్ఎస్-1 కిట్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. వ్యాధి జాడలు కనిపిస్తే నిర్ధారణ కోసం మాక్-ఎలీసా పరీక్ష నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తారు. అయితే ప్రైవేటు ల్యాబ్‌ల్లో నిర్వహించే పరీక్షలు మాత్రం డెంగ్యూ నిర్ధారణ కాదని జిల్లా వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ సూచనలు కనిపిస్తే డీఎంఅండ్‌హెచ్‌వో, డీఎంవో స్థాయి అధికారుల పర్యవేక్షణలో నిర్ధారణ చెయ్యవల్సిందే.



పి.గన్నవరం మండలంలో చేస్తున్న జ్వర సర్వే

డ్రైడే ఫ్రైడేతో మంచి ఫలితాలు

ప్రతి శుక్రవారం గ్రామాల్లో నిర్వహించే డ్రైడేఫ్రైడే కార్యక్రమం మంచి ఫలితాలిస్తోంది. గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు జ్వర సర్వేలను నిర్వహించి తగు సూచనలు చేస్తున్నాం. అలాగే పరిశీలన, శుభ్రంచేయడం, మూతలు పెట్టడం ద్వారా దోమలు నివారించవచ్చు. జిల్లాలో ఇప్పటివరకు 11 డెంగ్యూ కేసులు మాత్రమే నమోదయ్యాయి. **- నక్కా వెంకటేశ్వరావు, జిల్లా మలేరియా అధికారి**

దోమల నివారణకు చర్యలు..

- ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి.
- నీరు నిలువ చేయడం తప్పనిసరి అయితే అందులో వారానికి ఒకసారి కిరోసిన్ ఆయిల్ లేక వాడిన ఇంజన్ ఆయిల్ చల్లితే దోమలు వ్యాప్తి చెందవు.
- ఇంటి పరిసరాల్లో పనికిరాని తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వస్తువులు ఉండకుండా చూసుకోవాలి.
- గంబుషియా, గప్పి అనే చిన్న చిన్న చేపలను బావులు, కుంటలు వంటి వాటిలో వదిలితే నీటిలో ఉన్న దోమ లార్వాలను ఈ చేపలు తిని బతుకుతాయి. తద్వారా దోమలు పుట్టుక ఉండదు.
- ఇంటి పైకప్పులో ఉన్న ట్యాంకులకు మూతలు అమర్చాలి. లేకపోతే గుడ్లు పెట్టి పెరుగుతాయి.

దోమకాటు నుంచి రక్షణ కోసం..

- దోమకాటు నుంచి రక్షణకు దోమతెరలు వాడాలి.
- ఇంటి కిటికీలకు మెస్ అమర్చాలి.
- పొడవాటి దుస్తులను ధరించాలి. దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి. ఇళ్లల్లో క్రిమిసంహారక మందులను పిచికారి చెయ్యాలి.

టాప్ టెన్‌లో..

- ఉమ్మడి జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలకు ఉత్తమ ర్యాంకులు
- రాష్ట్రస్థాయిలో తూర్పు గోదావరికి రెండో స్థానం
- ఏడు, పది స్థానాల్లో నిలిచిన కోనసీమ, కాకినాడ జిల్లాలు

2, 7, 10.. ఇవీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలకు కేటాయించిన ర్యాంకులు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ ర్యాంకులను ప్రకటించింది. ఇందులో టాప్ టెన్‌లో తూర్పుగోదావరి రెండో స్థానంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడో స్థానంలో, కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, మాతా-శిశు ఆరోగ్యం తదితర 11అంశాల్లో రాష్ట్రంలో కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రెండు రోజుల క్రితం ర్యాంకులు వెల్లడించింది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన సమాచారం ఆధారంగా వీటిని కేటాయించారు. మొత్తం వంద మార్కులకు కాకినాడ జిల్లాకు 80.08, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 81.32, తూర్పుగోదావరి జిల్లాకు 82.63 వచ్చాయి. రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా రెండు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడు, కాకినాడ జిల్లా పది స్థానాల్లో నిలిచాయి.

మార్కులు ఇలా..

మొత్తం 12 అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులువేశారు. ఒక్కో అంశానికి పది మార్కులు, మరికొన్ని అంశాలకు ఐదేసి మార్కుల చొప్పున ఈ ర్యాంకులను కేటాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుకు మొత్తం పది మార్కులు కేటాయించగా కాకినాడజిల్లాకు 6.93 మార్కులు వచ్చాయి. 3.07 మార్కులు తగ్గాయి. వీటి పనితీరు కాస్త ఫర్వాలేదనిపిస్తోంది. మాతా-శిశుఆరోగ్యానికి 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 21.89, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 21.88, తూర్పుగోదావరిజిల్లాకు 22.56 వచ్చాయి. ఎన్‌యూహెచ్‌ఎం, వ్యాధుల నియంత్రణ, డీసీహెచ్‌ఎస్‌కు 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 24.10, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 22.58, తూర్పుగోదావరి జిల్లాకు 22.22 వచ్చాయి. కుటుంబనియంత్రణ, ఆరోగ్యసముదాయానికి సంబంధించి ఐదు మార్కులకు కేవలం 1.86 మార్కులే కాకినాడ జిల్లాకు వచ్చాయి. ఈ విషయంలో వెనుకబడే ఉంది. ఎచ్‌డబ్ల్యూసీకి సంబంధించి మొత్తంపది మార్కులకు కాకినాడ జిల్లాకు 9.8, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 9.83, తూర్పుగోదావరి జిల్లాకు 9.97 వచ్చాయి. ఆభ, ఎఫ్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి మొత్తం ఆరు మార్కులకు కాకినాడ జిల్లాకు 5.08, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 5.08, తూర్పు గోదావరి జిల్లాకు 5.12 వచ్చాయి.

ర్యాంకింగ్ సంతృప్తికరమే..



రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో టాప్ టెన్‌లో నిలవడం సంతృప్తినిచ్చింది. మొత్తం మూడు కేటగిరీల్లో ఈ ర్యాంకులను ప్రకటించారు. ప్రస్తుతం గుడ్ ఫెర్మార్మెన్స్ కేటగిరీలోనే కాకినాడజిల్లా ఉంది. కేవలంరెండు, మూడు మార్కుల తేడాలోనే ర్యాంకులు మారాయి. మన జిల్లాకు సంబంధించి కుటుంబ నియంత్రణ, కౌమార బాలిక ఆరోగ్యానికి సంబంధించి ఐదుమార్కులకు 1.86, క్వాలిటీ ఎస్యూరెన్స్‌కు సంబంధించి నాలుగు మార్కులకు 1.20 వచ్చాయి.

-డాక్టర్ జె.నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

డెల్టా రూపశిల్పి కాటన్ దొరకు ఘన నివాళి



కాటన్ దొరకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ధవళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): డెల్టా రూపశిల్పి, గోదావరి జిల్లాలను ఆంధ్ర అన్నపూర్ణగా మార్చిన సర్ అర్థర్ కాటన్ 222వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం కాటన్ బ్యారేజ్ ముఖద్వారం వద్ద ఉన్న కాటన్‌దొర విగ్రహానికి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీరామకృష్ణ, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్, ఇతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్‌బాబు, ఏఈలు అద్దంకి సాయిరాం, రాధాకృష్ణ, సునీల్ పాల్గొన్నారు.

- ధవళేశ్వరంలోని కాటన్ స్మృతి వనంలో కాటన్‌దొర విగ్రహానికి డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజలు గుండెల్లో ఆయన చిరస్మరణీయుడుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో గరగ శ్రీనివాసరావు, మోర్త పావనమూర్తి, శ్రీరంగంబాలరాజు, పులపర్తి కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా 222వ జయంతి వేడుకలు

- గోదావరి నదిపై ఆనకట్ట కట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన కాటన్‌దొర ఆంధ్రుల పాలిట అన్నదాత అయ్యారని కూటమి నాయకులు కొనియాడారు. కాటన్ స్మృతి వనంలోని కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పండరి అప్పారావు, యడ్లమహేష్, నీలి కోటేశ్వరరావు, బీరా ప్రకాష్, రెహ్మాన్‌ఖాన్, దారపు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కాటన్ దొర జయంతిని పురస్కరించుకుని బీఎస్ కెమికల్స్ అధినేత బీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కపిలేశ్వరపురానికి చెందిన ఈయన నాలుగేళ్లుగా కాటన్‌పై అభిమానంతో ఏర్పాటుచేస్తున్నారు.

మన్యంలో చైల్డ్ ఆర్టిస్ట్ భానుప్రకాష్ సందడి

మోతుగూడెం, మే 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో చైల్డ్ ఆర్టిస్ట్ భానుప్రకాష్ సందడి చేశాడు. పర్యాటక ప్రదేశాలైన ధారాలమ్మగుడి పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతం, పుష్ప షూటింగ్, బ్రిడ్జి ఫోర్‌బై రిజర్వాయర్ వద్ద పర్యటించి సందడి చేశాడు. ఈ సందర్భంగా భానుప్రకాష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.... తాను తండేల్, కింగ్డమ్, హరికథ, కేజీఎఫ్-2, యక్షిణి, గమనం, విమానం, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, లవ్‌స్టోరీ, సరిలేరు నీకెవ్వరు, వెంకీమామ, కథానాయకుడు, మిస్టర్ మజ్ను, ఒకక్షణం వంటి 60 సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించానని, అందులో కొన్ని ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని తెలిపాడు. సినిమాల్లోనే కాకుండా టీవీ షోలు, సీరియళ్లు, నాటకాలు వంటి ఇతర రంగాల్లోను నటనతో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. తన తండ్రి సురేష్ కూడా సినిమా రంగానికి చెందిన వాడేనని, ఆయన 30కిపైగా లఘు చిత్రాల్లో చేశాడని తెలిపాడు. తాను హార్ట్‌బీట్ అనే ఇండిపెండెంట్ సినిమా కూడా చేశానని తెలిపాడు.



భానుప్రకాష్



సీ పోర్టు సమీపంలో కంటైనర్ కేంద్రాన్ని ప్రారంభించిన కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

కాకినాడలో కంటైనర్ ఫ్రైట్ స్టేషన్

- కార్గోల ఎగుమతి, దిగుమతులకు అందుబాటులోకి కేంద్రం
- ప్రారంభించిన కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

కాకినాడ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు వివిధ రకాల కార్గోల ఎగుమతి, దిగుమతులకు కంటైనర్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌ను కాకినాడ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.రవికుమార్ గురువారం ప్రారంభించగా కాకినాడ సీ పోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, శ్రావణ్ గ్రూప్ ఎండీ జి.సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ఈ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌తో కాకినాడ పారిశ్రామికంగా మరింత ఎదగనుందన్నారు. ప్రస్తుతం ఇటువంటి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు విశాఖలో పది ఉన్నాయన్నారు. కాకినాడలో షిప్పింగ్ ఆధారిత వ్యాపారం మరింత పుంజుకోనుందని తెలిపారు. వ్యాపారులు కంటైనర్ ఎగుమతుల కోసం చెన్నై, విశాఖ వెళ్లక్కర్లేకుండా ఇక్కడి నుంచే విదేశాలకు ఎగుమతులు చేయవచ్చని వివరించారు. ఈ కేంద్రం ఆక్వా, ఫార్మా, రైస్, రా షుగర్ దిగుమతికి ఉపయోగపడుతుందన్నారు.

కాకినాడ సీ పోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ ఎగుమతుదారులకు సరైన సదుపాయాలు లేక కాకినాడలో కంటైనర్ వ్యాపారం చాలా తక్కువగా జరుగుతోందన్నారు. ఈ కేంద్రం రాకతో అన్ని షిప్పింగ్ కంపెనీలు త్వరలో కార్యకలాపాలు మొదలుపెడతాయన్నారు. ఫ్రైట్ స్టేషన్ ఏర్పాటుకు మొదట్లో చాలా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. పోర్టు, కస్టమ్స్, ఫ్రైట్ స్టేషన్ కలిసి కాకినాడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రధానంగా బియ్యం ఎగుమతులకు కంటైనర్లు చాలా ఉపయోగమన్నారు.

శ్రావణ్ గ్రూప్ ఎండీ సాంబశివరావు మాట్లాడుతూ కాకినాడలో తాము ఏర్పాటుచేసిన కంటైనర్ కేంద్రం ఎగుమతులకు ఎంతోగానే కలిసివస్తుందన్నారు. పది ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ఒకేసారి మూడువేల కంటైనర్లను హ్యాండిల్ చేయవచ్చన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 2004లో తమ సంస్థ తొలి సీఎఫ్ఎస్ ఏర్పాటు చేసిందన్నారు. ఆ తర్వాత మరొకటి ఏర్పాటు చేయగా మూడోది కాకినాడలో ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో కస్టమ్స్ అధికారులు, షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా కొత్తపల్లిలో...

వికసించిన 'మే' పుష్పాలు

కొత్తపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన కాకరపల్లి గంగాధర శ్రీనివాసరావు ఇంటి ప్రాంగణంలో 'మే' పుష్పాలు వికసించాయి. గతంలో ఒకటి లేక రెండు పూసేవని, ఈసారి ఏకంగా నాలుగు వికసించాయని చెప్పారు.

కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన యాదవుల వీధిలో మట్టపర్తి అనంతలక్ష్మి ఇంటి పెరట్లో మూడు మే పుష్పాలు వికసించాయి. 15 ఏళ్ల నుంచి పూలు పూస్తున్నట్టు ఆమె చెప్పారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో...



తల్లిదండ్రులు సుహానీబీ, యాకూబ్‌లతో అబ్దుల్ రజాక్

పేదింట విరిసిన విద్యా కుసుమం

ఏపీ ఈసెట్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అబ్దుల్ రజాక్‌కు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు

రామచంద్రపురం (ద్రాక్షారామ), మే 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణానికి చెందిన అబ్దుల్ రజాక్ ఏపీ ఈసెట్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 121 మార్కులతో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. రజాక్ ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు స్థానిక సన్ షైన్ ఇంగ్లిషు మీడియం స్కూల్లో చదివాడు. పదో తరగతిలో 589 మార్కులు సాధించగా ఐఐటీ చదవాలన్న అతడి లక్ష్యానికి పేదరికం అడ్డువచ్చింది. తండ్రి షేక్ యాకూబ్ టైలరింగ్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి సుహానీబీ సహేబా గృహిణి. కొద్దికాలం ప్రైవేటు పాఠశాలలో పనిచేసింది. ఇంటర్ కార్పొరేట్ కళాశాలలో చదివించే స్థోమత లేకపోవడంతో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాయగా విశాఖలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిలో సీటు వచ్చింది. తల్లిదండ్రులు విశాఖలో అద్దె ఇంట్లో ఉంటూ రజాక్‌ను మూడున్నర ఏళ్ల పాలిటెక్నిక్ చదివించారు. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. అబ్దుల్ రజాక్ మీడియాతో మాట్లాడుతూ జేఎన్టీయూలో బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేస్తానన్నాడు. ఎంబీఏ చేసి పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తన జీవిత లక్ష్యమని వివరించాడు.

8,586 విద్యుత్ కేసులు పరిష్కారం

- వినియోగదారులకు రూ.14 లక్షలు పరిహారం
- సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లాల నుంచి విద్యుత్ సమస్యలకు సంబంధించి 8,748 కేసులు రాగా వాటిలో ఇప్పటివరకు 8,586 కేసులను పరిష్కరించినట్టు సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. కాకినాడ జిల్లా కరప విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలో గురువారం నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగదారులు సమీప అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో గానీ లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని, 60రోజుల్లో పరిష్కారం చూపకపోతే సంబంధిత అధికారుల నుంచి నష్టపరిహారం అందించేలా చూస్తామన్నారు. ఇలా ఇప్పటివరకు 108 కేసుల్లో అధికారులను బాధ్యులను చేస్తూ వారి నుంచి వినియోగదారులకు రూ.14,36,956 పరిహారంగా చెల్లించామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు, వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ సదుపాయం ఉందన్నారు. విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే సీజీఆర్ఎఫ్‌ను సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలకు గురై మరణించిన, అంగవైకల్యం పొందిన వారికి సంస్థ నుంచి పరిహారం అందుతుందన్నారు. ఈ విషయంలో అధికారులు సకాలంలో స్పందించకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసే అధికారం సీజీఆర్ఎఫ్‌కు ఉందని స్పష్టం చేశారు. అనంతరం వినియోగదారుల నుంచి 11 అర్జీలు స్వీకరించి వాటి సత్వర పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీజీఆర్ఎఫ్ ఫైనాన్స్ మెంబర్ సలాది సుబ్బారావు, ఇండిపెండెంట్ మెంబర్ ఎస్.మురళీకృష్ణ, విద్యుత్ శాఖ డీఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి, ఏఈ సానా ఈశ్వరప్రసాద్, జేఈ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో కురుసున్న భారీ వర్షం



కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం

వచ్చింది..వాన!

ప్రస్తుతం మండుతున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షం కురిస్తే బాగుండును వాతావరణం చల్లగా మారుతుందని ఆశపడుతున్నారు. అయితే గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల వర్షం పడి ఉపశమనం పొందారు.



కాకినాడ వర్షంలో వాహనదారులు

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం

బాలిక పై నుంచి వెళ్లిన ధాన్యం లోడు ట్రాక్టర్

రాయవరంలో ఘటన

రాయవరం, మే 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో 13 ఏళ్ల బాలిక దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన పాలపర్తి నాగవర్షిణి (13) తన సమీప బంధువుతో కలిసి బైక్‌పై రాయవరంలో ఉన్న బంధువుల ఇంటికి గురువారం వచ్చింది. బంధువులు ఇంటి నుంచి తిరిగి మహేంద్రవాడకు ద్విచక్రవాహనంపై వస్తుండగా రాయవరంలో ధాన్యంలోడ్ ట్రాక్టర్‌ను తప్పించబోయే సమయంలో బైక్ అదుపు తప్పి ఇద్దరు కిందపడిపోయారు. ఆ సమయంలో వెనక కూర్చున్న బాలికపై నుంచి ధాన్యం లోడు ట్రాక్టర్ వెళ్లిపోవడంతో నాగవర్షిణి కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. బాలికను స్థానికులు హుటాహుటిన 108సాయంతో రామచంద్రపురం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మండపేట ప్రభుత్వాసుపత్రిలో శవ పంచనామా నిర్వహించిన అనంతరం బంధువులకు బాలిక మృతదేహాన్ని అప్పగిస్తామని రాయవరం ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. మృతురాలి తండ్రి పాలపర్తి వీరవెంకటసత్యనారాయణ గ్రామరెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలాఉండగా నాగవర్షిణి 5 వతరగతి చదువుతుంది. మృతురాలి సోదరి ఒణీల వేడుక రెండు రోజుల క్రితమే నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువుల మధ్య ఆనందంగా జరిగిన వేడుకను మరువకముందే ఈ సంఘటన జరగడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనా స్థలానికి మండపేట రూరల్ సీఐ పితల దొరరాజు చేరుకుని ప్రమా దంపై ఆరా తీశారు.



సంఘటనా స్థలంలో బాలిక

పిడుగుపడి కౌలు రైతు మృతి



బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కాజులూరు (కరప), మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగు పడి ఒక కౌలు రైతు మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన బుకే బాలకృష్ణ (35) రామచంద్రపురం మండలం కాపవరంలోని అత్తగారి ఇంటి వద్ద ఉంటూ కౌలు రైతుగా జీవనం సాగిస్తున్నాడు. కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామానికి చెందిన సలాది రాంబాబు అనే రైతుకు చెందిన రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. గురువారం సాయంత్రం చేలో పని ముగించుకున్న బాలకృష్ణ తిరిగి కాపవరం వెళ్తుండగా భారీ వర్షం కురుస్తుండడంతో జగన్నాథగిరి గ్రామ సమీపంలో ఆగాడు. అదే సమయంలో అతడిపై పిడుగు పడడంతో ఘటనా స్థలంలోనే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జగన్నాథగిరి వీఆర్వో ఈశ్వర సత్యనారాయణ ఇచ్చిన రిపోర్టు మేరకు గొల్లపాలెం పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ మృతితో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహం వద్ద బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పోలీసులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులోని ఔరంగాబాద్-2 ఇసుకర్యాంపులో నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభు త్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 50ఏళ్లు ఉంటుందని, దేహంపై వైట్ కలర్ కట్ బనియన్, నలుపురంగు షార్ట్ ఉన్నాయని, ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లేదా 9440796622, 9492482056లో సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

అలాగే పట్టణంలోని ఆరికిరేవుల రోడ్‌లోని దండకుం ట పుంత ఇసుకర్యాంపులో గామన్ బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై నీలం, తెలుపురంగుల గడుల షర్ట్, నీలంరంగు ప్యాంటు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసినవారు సమాచారం అందించాలని, కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో సర్పంచ్ భర్త అరెస్ట్

తొండంగి, మే 15 (ఆంధ్రజ్యోతి): ముగ్గురి నుంచి రూ.17.5 లక్షల మొత్తాన్ని కాకినాడ జిల్లా తొండంగి మండలం కోదాడ సర్పంచ్ బూర్తి రత్న కుమారి భర్త నాని చీటింగ్ చేసి కాజేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. వివరాల ప్రకారం.. కోదాడ గ్రామానికి చెందిన నొక్కు సూర్యనారాయణ మరో ఇద్దరికి ఎస్ఈజెడ్‌లో భూములు పోయినందుకు వచ్చిన పరిహారాన్ని నాని కాజేసినట్టు సూర్యనారాయణ ఫిర్యాదు చేశాడు. కొంతమొత్తం ఇచ్చి మిగిలిన మొత్తానికి ఖాళీ చెక్కులపై బెదిరించి బలవంతంగా సంతకాలు చేయించుకుని రూ.17.5 లక్షల సొమ్మును కాజేశాడన్నారు. పెద్దాపురం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేయించి ఆ మొత్తాన్ని కాజేసినట్టు ఆధారాలతో సూర్యనారాయణ ఫిర్యాదు చేశాడన్నారు. విచారణ జరిపి నానిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిందన్నారు.

సామర్లకోట చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

- **కోర్టును ఆశ్రయించినా సమావేశాన్ని అడ్డుకోలేకపోయిన అరుణ**
- **అవిశ్వాస తీర్మాన సమావేశానికి 25 మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరు**

సామర్లకోట, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ (వైసీపీ)పై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన నేపథ్యంలో ప్రత్యేకాధికారి మల్లిబాబు సమక్షంలో గురువారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీంతో ఏకాకి అయిన చైర్‌పర్సన్ అరుణ గత్యంతరం లేని పరిస్థితుల్లో తన పదవికి రాజీనామా లేఖను సమావేశానికి గంట ముందుగా కమిషనర్ శ్రీవిద్యకు అందజేశారు. అప్పటికే ప్రత్యేక సమావేశం నిర్వహణకు అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ఇక తనకు ఓటమి తప్పదని భావించిన చైర్‌పర్సన్ అరుణ రాజీనామా లేఖను అందజేశారు. ఇప్పటికే సమావేశం నిర్వహించకుండా అడ్డుకునేందుకు చైర్‌పర్సన్ కోర్టులను సైతం ఆశ్రయించినప్పటికీ సమావేశం నిర్వహించేందుకు ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో గురువారం ముందుగా ఊహించిన రీతిలోనే సమావేశం నిర్వహించారు. అందరూ ఊహించినట్లు అవిశ్వాసానికి అనుకూలంగా 25 మంది కౌన్సిలర్లు చేతులెత్తి మద్దతు తెలిపారు. సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన మల్లిబాబు కౌన్సిలర్లను లెక్కించారు. తదనంతరం విలేకర్లతో మాట్లాడుతూ చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించడంతో ఫలితాన్ని వెల్లడించడంలేదని చెప్పారు.



రాజీనామా లేఖను సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న చైర్‌పర్సన్

అందుకే అవిశ్వాసం ప్రకటించాం

మూడు నెలలు మాత్రమే చైరపర్సన్ పదవిలో కొనసాగేందుకు ముందుగా పార్టీ నాయకులు నిర్ధేశించినప్పటికీ ఊహించని రీతిలో నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగిన చైర్‌పర్సన్ అరుణ సొంత పార్టీ కౌన్సిలర్లనే ఏమాత్రం లెక్కించకుండా ఏకపక్షధోరణి అవలంబించడం వల్లే కౌన్సిలర్లు అందరూ వ్యతిరేకించామని వైస్ చైర్మన్లు జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్‌కుమార్, రెడ్నం సునీత, నేతల హరిబాబు పేర్కొన్నారు. కౌన్సిల్ ప్రత్యేక సమావేశం అనంతరం విలేకర్లతో వారు మాట్లాడుతూ పార్టీని, నాయకులను కించపరిచే రీతిలో చైర్‌పర్సన్ మాట్లాడడం దురదృష్టకరం అన్నారు. పార్టీ పలు దఫాలు చేసిన సూచనలు పెడచెవిన పెట్టారన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన చైర్‌పర్సన్ అరుణను ఇప్పటికే పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. తదుపరి జరిగే కార్యక్రమాలకు పార్టీ అధిష్టానం సూచనల మేరకే తామంతా కలిసి పనిచేస్తామని, పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి పథంలోకి పయనింపజేస్తామని వారు చెప్పారు.

‘నన్నయ’లో జూలై 14 నుంచి ఈఎఫ్‌డీపీ కార్యక్రమం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జూలై 15 నుంచి 19 వరకూ క్వాంటం టెక్నాలజీస్ అపర్చునిటీస్ అండ్ థ్రెట్స్ అనే అంశంపై ఆఫ్‌లైన్ పద్ధతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం వీసీ ఆవిష్కరించి వివరాలు తెలిపారు. అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఇ) ట్రైనింగ్ అండ్‌లెర్నింగ్ (ఏటిఏఎల్) నుంచి దీనికి అనుమతి లభించిందన్నారు. ఈ కార్యక్రమం ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలల్లో 2025-26 నుంచి మైనర్ డిగ్రీ వర్తింపచేసి అనుసరిస్తున్నవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయం వెబ్సైట్ నుంచి పొందవచ్చని తెలి పారు. ఈఎఫ్‌డీపీకి కోఆర్డినేటర్‌గా వి.పెర్సిస్, అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా జి.కీర్తి మరిట వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ వి.పెర్సిస్, అసిసెటంట్ కోఆర్డినేటర్ జి.కీర్తిమరిట పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కుమారుడి కళ్లెదుటే మరణించిన తల్లి



లారీ కింద సుధా మృతదేహం



ఫైల్‌ఫొటో

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని కుమారుడి కళ్లెదుటే తల్లి మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కొవ్వూరు జగనన్నకాలనీ గుత్తావారి చెరువు లేఅవుట్-1లో నివాసం ఉంటున్న దూసనపూడి సుధా (46) నందమూరు రోడ్‌లోని యువరాజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా టైలరింగ్ షాపులో టైలరింగ్ చేస్తుంది. భర్త కృష్ణసాయి పాసింజర్ ఆటో నడుపుతుంటాడు. కుమార్తె శ్రీలత డిగ్రీ చదువుతుంది. కుమారుడు చరణ్ ఉన్నాడు. ప్రతిరోజు కాలనీ నుంచి భర్త లేదా కుమారుడు గాని మోటారుసైకిల్‌పై షాపు వద్దకు తీసుకొస్తుంటారు. రోజూ మాదిరిగా కుమారుడు చరణ్ గురువారం ఉదయం తల్లిని మోటారుసైకిల్‌పై తీసుకుని షాపునకు బయలుదేరాడు. గామన్‌బ్రిడ్జి సెంటర్ సమీపంలో దొమ్మేరురోడ్‌లో వేబ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు కిందపడిపోయారు. సుధ నడుము పై నుంచి లారీచక్రాలు ఎక్కడంతో నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతిచెందింది. చరణ్‌కు కుడి చెయ్యి, కుడికాలు, కుడి పాదానికి గాయాలు కావడంతో స్నేహితుడి సహాయంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చరణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కాకినాడలో యువకుడి హత్య

కాకినాడ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన గురువారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఏటిమొగకు చెందిన వాడ్రేవు బద్రీ కిరణ్ (20) ఐటీఐ చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తన పెంపుడు కుక్క అనారోగ్యంగా ఉండడంతో వైద్యం నిమిత్తం దానిని తీసుకుని తన స్నేహితుడైన పెసంగి శ్యామ్‌తో కలిసి బుధవారం కాకినాడ రామారావుపేటలోని వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడికి కిరణ్‌కు తెలిసిన పెమ్మాడి హరీష్, కోలా మహేష్ ఆటోలో వచ్చి అతడికి బలవంతంగా తీసుకునిపోయారు. అది చూసిన శ్యామ్ వెంటనే కిరణ్ తల్లి దుర్గకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆమె రాత్రి వరకు చుట్టుపక్కల వెతికి అనంతరం పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోర్టు సీఐ మ్యాన్ మిస్సింగ్ కేసుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం కాకినాడ రూరల్ మండలం నేమాం సమీపంలోని ఎస్ఆర్ ఎంటీ చౌదరి ఘాట్ వద్ద సముద్రంలో బద్రీ కిరణ్ మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, పోర్టు సీఐ సునీల్ కుమార్, సిబ్బంది సముద్ర తీరం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి ఛాతిపైన, గొంతుపైన తీవ్ర రక్తపు గాయాలు ఉండడంతో ముమ్మాటికీ హత్యేనని నిర్ధారించి మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నారు. బద్రీ కిరణ్‌కు, పెమ్మాడి హరీష్ భార్యకు వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మరో స్నేహితుడు కోలా మహేష్ సహాయంతో హరీష్ బీర్ బాటిల్ పగులగొట్టి ఈ హత్యకు పాల్పడినట్టు భావించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కిరణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్‌పాటిల్

తూరంగిలో చోరీ

సుమారు 160 గ్రాముల బంగారం, రూ.40,000 నగదు అపహరణ

కాకినాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వెలమల తూరంగిలో చోరీ జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చంద్రమౌళి శ్రీనివాసశర్మ (26) పౌరోహిత్యం చేస్తుంటాడు. ఆయన బుధవారం రాత్రి 10 గంటల తర్వాత ఇంటికి తాళాలు వేసి గృహప్రవేశ కార్యక్రమం నిమిత్తం పిఠాపురం వెళ్లాడు. కార్యక్రమాన్ని ముగించుకుని గురువారం ఉదయం 6 గంటలకు తన ఇంటికి వచ్చేసరికి గేటు, ఇంటికి వేసిన తాళాలు బద్దలు గొట్టి ఉండటంతో కంగారుగా ఇంటిని, గదిలోని బీరువాను పరిశీలించేసరికి సుమారు 160 గ్రాముల బంగారం, రూ.40,000 నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి మధ్యాహ్నం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎం.వీరబాబు పేర్కొన్నారు. శ్రీనివాస శర్మ భార్య, పిల్లలు విశాఖ జిల్లా చోడవరం వెళ్లారని చెప్పారు. చోరీ జరిగిన ఇంటిని ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, క్లూస్ టీమ్ పరిశీలించారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో...

డీఆర్ ఆనందరావు అరెస్టు

రాజమహేంద్రవరం/కాకినాడ మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ లంచం తీసుకుంటుండగా కె. ఆనందరావును మార్చి 28న ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన బెయిల్‌పై ఉన్నారు. అయితే ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో ఈనెల 15న ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లల్లో.. కాకినాడ, హైదరాబాద్, బోధన్ వంటి ప్రాంతాల్లోనూ సోదాలు చేశామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ పేర్కొన్నారు. ఆనందరావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు.

జగ్గంపేటలో ‘శుభం’ సందడి



జగ్గంపేట, మే 15(ఆంధ్రజ్యోతి): శుభం చిత్రబృందం గురువారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో సందడి చేసింది. సక్సెస్ మీట్‌లో భాగంగా జగ్గంపేట ఎస్‌విఎఫ్ నాగేశ్వర థియేటర్‌కు బృందసభ్యులు హర్షితారెడ్డి, శ్రియ, శ్రీనివాస్ గౌరెడ్డి, శ్రావణి లక్ష్మి, చరణ్ పెర్రి, షాలిని కొండేపూడి, వంశీధర్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల, ఆర్య విచ్చేశారు. ప్రేక్షకులతో కలిసి సినిమా చూసి ఆడిపాడారు.

3 గంటల పాటు రాజమండ్రిలో వివేక్ ఎక్స్‌ప్రెస్

ఊడిన ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్ కవర్

గుర్తించి నిలిపివేసిన టీఎక్స్ఆర్ సిబ్బంది

రాజమహేంద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): దుమ్రిఘర్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న ట్రైన్ నెంబర్ 22503 వివేక్ ఎక్స్‌ప్రెస్ మర మ్మతులకు గురికావడంతో తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి స్టేషన్‌లో 3 గంటల పాటు నిలిపివేశారు. ఇది భారతదే శంలో అతి ఎక్కువ రోజులు ప్రయాణించే రైలు. ఈ రైలు గురువారం రాత్రి 8:50 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాంకు చేరుకునే సమయంలో ఇంజన్ నుంచి 14వ బోగీ అయిన బీ1 ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్‌కు ఉండే కవర్ ఊడిపోయి, బోల్టులు కూడా ఊడిపోతుండగా టీఎక్స్ఆర్ సిబ్బంది గుర్తించారు. అయితే కవర్ మార్చే ఏర్పాట్లు లేకపోవడంతో బీ1 బోగీని రాజమండ్రి స్టేషన్‌లో వదిలేసి మిగతా రైలును 11:50 ప్రాంతంలో పంపించారు. బీ1 బోగీలోని ప్రయాణికులను వేరే బోగీలో సర్దుబాటు చేశారు. విశాఖలో మరొక బోగీని లింక్ చేస్తామని అధికారులు తెలిపారు. ఎస్ ఎంఆర్ రంగనాథ్, చీఫ్ కమర్షియల్ ఇన్ స్పెక్టర్ కల్యాణ్ కుమార్ మరమ్మతులను పర్యవేక్షించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది బందో బస్తు నిర్వహించారు. విషయం గుర్తించక పోతే రైలు పట్టాలు తప్పి పెను ప్రమాదమే కలిగేది.





రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ఉండిపోయిన బీ1 బోగి, ఊడిపోయిన బాక్స్ రింగ్ కవర్

చీటింగ్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి చీటింగ్ చేసిన వ్యక్తికి ఒక ఏడాది జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన బీరుదా వెంకటరమణ అనే వ్యక్తి కుమారుడికి స్టీల్‌ప్లాంట్‌లో నెలకు రూ.50వేలు జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తానంటూ వైజాగ్‌కు చెందిన పూరెడ్డి శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి నమ్మించాడు. ఈ క్రమంలో వెంకటరమణ నుంచి రూ.10లక్షలు తీసుకుని ముఖం చాటేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని అడగ్గా చంపుతానని బెదిరించాడు. దీంతో చేసేదిలేక వెంకటరమణ 2015 డిసెంబరు 10వ తేదీన కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసిన అప్పటి ఎస్‌ఐ కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. వాదోపవాదనల అనంతరం శ్రీనివాసరెడ్డి నేరం చేసినట్టు రుజువుకావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి తీర్పు వెలువరించారు. బాధితుడి తరపున ఏపీపీ ఎన్.నాగరాధిక ఈ కేసు వాదించారు. ఈ కేసుకు సంబంధించిన సాక్షులు, సాక్ష్యాలను సమర్థవంతంగా కోర్టుకు అందజేసి నిందితుడికి శిక్షపడేలా చేసిన ఎస్‌ఐ సునీత, కోర్టు కానిస్టేబుల్ కె.రాజేష్‌లను సీఐ చైతన్యకృష్ణ అభినందించారు.

మహిళ మెడలోని బంగారం చోరీ

కాజులూరు (కరప), మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామంలో భర్తతో కలిసి మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న ఒక మహిళ మెడలోని 52గ్రాముల బంగారాన్ని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించుకుపోయారు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అండ్రంగి గ్రామానికి చెందిన బండారు త్రిమూర్తులు, అతడి భార్య సూర్యకాంతం గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో మోటర్‌సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళ్తున్నారు. పెనుమళ్ల గ్రామ శివారుకు వచ్చేసరికి గుర్తుతెలియని ఇద్దరు వ్య క్తులు వెనుక నుంచి వచ్చి సూర్యకాంతం మెడలోని బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండను బలవంతంగా లాక్కుని పారిపోయారు. నిందితులను వెంబడించినా ఫలితం లేకపోవడంతో బాధితులు గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

మలికిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎత్తు వంతెన వద్ద నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో నేడు లలితా సహస్రనామ పారాయణం, అష్టలక్ష్మి అమ్మవారికి పుష్పార్చన, కుంకుమార్చనలను ఆలయ అర్చకులు నండల్‌నంబూద్రిచే జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు వీటిని విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా అమ్మవార్ల తీర్థం

మలికిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): మేడిచర్లపాలెంలో ఉన్న కనకదుర్గమ్మ, మారెమ్మ, నూకాలమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పలు పూజలతో పాటు మొక్కుబడులు చెల్లించుకున్నారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న పంచాయతీ జిల్లా అధికారి శాంతలక్ష్మి

సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

డీపీవో శాంతలక్ష్మి

ముమ్మిడివరం, మే 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని పంచాయతీ జిల్లా అధికారిని శాంతలక్ష్మి సూచించారు. ముమ్మిడివరంలోని ఎంపీడీవో కార్యాలయంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ, మండల కంప్యూటర్ ఆపరేటర్‌లకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో చెత్త ఎక్కడబడితే అక్కడ పేరుకుపోయి ఉంటుందని దాన్ని అధిగమించేందుకు తడిపొడి చెత్తను సేకరించి వాటిని వేస్ట్‌మెనేజ్‌మెంట్ కేంద్రాలకు తరలించాలన్నారు. కంపోస్టును తయారు చేయడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. వర్షాకాలం ప్రవేశించనున్న దృష్ట్యా తాగునీరు సరఫరా, శానిటేషన్, కోరినేషన్ వంటి విషయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, ఎంపీడీవో పాడి శ్రీవెంకటాచార్య తదితరులతో పాటు మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు, మండల, పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

లంక గ్రామాల వంతెన పనులు 60 శాతం పూర్తి

పి.గన్నవరం, మే 15(ఆంధ్రజ్యోతి): గంటి పెదపూడి, ఊడిమూడి లంక గ్రామాల నిమిత్తం నిర్మితమవుతున్న వంతెన పనులు 60 శాతం పూర్తయినట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీ.శ్రీనివాస్ తెలిపారు. గంటిపెదపూడిలోని వంతెన పనులను గురువారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఫైర్ సిక్స్‌ను సుమారు 37 మీటర్లకు దింపామన్నారు. సాంకేతిక అంశాలను పరిశీలించి బాటమ్ పక్కింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులకు నిధులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో వంతెన పనులను పరిశీలించడంతోపాటు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈఈ ప్రభాకరరెడ్డి, ప్రాజెక్టు డీఈ ఎ.రాంబాబు, ఏఈలు కొండలరావు, సత్యనారాయణ, పలువురు సిబ్బంది తదితరులు ఉన్నారు.



వంతెన పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధ్యం

యానాం, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను నేర్చుకున్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలరని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఇటీవల పుదుచ్చేరి విద్యాశాఖ పరిధిలోని సీబీఎస్ఈ ఇంటర్, పదవ తరగతి పరీక్షల ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఆయన నేతృత్వంలో గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. స్థానిక డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం పరిపాలనాధికారి మునిస్వామి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.రత్నప్రభ, ఐటీఐ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్‌తో పాటు పాలిటెక్నిక్, వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, పాలిటెక్నికల్, ఐటీఐలో చేరాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. అనంతరం ఆయన నేతృత్వంలో విందు ఏర్పాటు చేశారు. యానాంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐలకు చెందిన అధ్యాపక బృందం హాజరయ్యారు.

టీచర్స్ ఫెడరేషన్ సంతాపం

ముమ్మిడివరం, మే 15(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు యేలేటి వెంకట్రాజు ఆకస్మిక మృతి పట్ల అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమావేశం సంతాపం వ్యక్తం చేసింది. ముమ్మిడివరంలో గురువారం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్.మునేశ్వరరావు అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో వెంకట్రాజు మృతికి మౌనం పాటించారు. వెంకట్రాజు రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా పలు సేవలందించారని వక్తలన్నారు. అనంతరం వారంతా ధవలేశ్వరం వెళ్లి వెంకట్రాజు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యు.వెంకట్రావు, మడికి నాగభూషణం, ఉపాధ్యక్షుడు మోర్త రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు



నాలుగురోడ్ల సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ జామ్

అంబాజీపేట, మే 15(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని ఈదరపల్లి వద్ద వంతెన నిర్మాణం కారణంగా ట్రాఫిక్‌ను అంబాజీపేట మీదుగా మళ్లించడంతో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించిపోయింది. పోలీసులు లేకపోవడంతో వాహనదారులే క్లియర్ చేసుకోవాల్సిన పరిస్థితి. గంటల తరబడి ట్రాఫిక్‌లో ప్రజలు ఇరుక్కుని తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు.

19న రామచంద్రపురంలో జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే15 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో చంద్రబాబు ఉపాధి కార్యాలయం లో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ ప్రకటనలో పేర్కొన్నారు. ఏషి యన్ ఆటో పార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, నీమ్రానా స్టీల్ సర్వీస్ సంస్థల్లో ఆపరేటర్ల పోస్టులకు నియామకాలు జరుగుతాయని మంత్రి కార్యాలయం తెలిపింది. ఏషియన్ ఆటో పార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేయడానికి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో చదివిన 18 నుంచి 30 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. నిమ్రానా స్టీల్ సర్వీసెస్ సంస్థల్లో పనిచేయడానికి 10వ తరగతి నుంచి డిగ్రీ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాను వినియోగించుకోవాలని నిరుద్యోగ యువతను కోరారు.

అపర భగీరథుడు కాటన్

• రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ • కాటన్ విగ్రహాలకు నాయకులు, అధికారులు, ప్రజలు నివాళి



అంతర్వేదిలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



రాజోలులో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



అంబాజీపేటలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

రాజోలు, మే 15(ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం కాటన్ జయంతి సందర్భంగా రాజోలు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాటన్‌కు మనమంతా రుణపడి ఉండాలని, ఆయన కృషి వల్లే ఈ రోజు మనం సుభిక్షంగా ఉన్నామని, ఆయన సేవలను అందరం స్మరించుకోవాలన్నారు. గోదావరి జలాలను పొలాలకు తరలించి పరివాహక జిల్లాలను సస్యశ్యామలం చేసిన రైతు బాంధవుడు కాటన్‌దొర అన్నారు. కాటన్ దొర ముందుచూపుతో చేసిన కృషితో గోదావరి వాసులకు బంగారు పంటలను ఇచ్చిన వ్యక్తిగా చరిత్రకెక్కారని తెలిపారు. తాటిపాక ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో కాటన్ చిత్రపటానికి, పొదలాడ లాకుల వద్ద కాటన్ విగ్రహానికి గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందేలాచేసిన కాటన్ దొర చిరస్మరణీయుడని అన్నారు. డెల్టా ప్రాంతంలో ప్రజల గుండెల్లో కొలువైన భగీరథుడు కాటనదొర అని అన్నారు. గోదావరి జిల్లాలను పొలాలకు తరలించి పరివాహక జిల్లాలను సస్యశ్యామలంచేసిన రైతు బాంధవుడు కాటన్‌దొర అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ రమేష్, రాజోలు నియోజకవర్గ నీటిసంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ పినిశెట్టి బుజ్జి, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, చాగంటి స్వామి, మద్దాల తమ్మయ్య, కడలి కృష్ణమోహన్, మామిడిశెట్టి నాగరాజు, కడలి వెంకటరమణ, పంచదార చినబాబు, ఇరిగేషన్ ఏసీ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రమీలారాణి, లష్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్, తహశీల్దారు కార్యాలయాల వద్ద కాటన్ జయంతిని గురువారం నిర్వహించారు. ఆయా కార్యాలయాల వద్ద ఉన్న విగ్రహాలకు శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, టీకేఎస్ నాయకులు ముత్యాల జమీలు, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గణపతి వీరరాఘవులు, రవణం రాము, ముత్తాబత్తుల ప్రశాంత్, ఇన్‌చార్జ్ తహశీల్దారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రాంతాల్లో గురువారం కాటన్ జయంతిని జరిపారు. ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, గొల్లవిల్లి నీటి సంఘం ఛైర్మన్ నల్లా సత్యనారాయణ తదితరులు ఉప్పలగుప్తంలో కాటన్ విగ్రహానికి నివాళులర్పించారు. కాట్రేనికోన డీసీ మాజీ ఛైర్మన్ అరిగెల నానాజీ, ఉప్పలగుప్తం డీసీ వైస్ ఛైర్మన్ గుత్తుల శ్రీనివాస్, నీటి సంఘం ఛైర్మన్లు మోటూరి రవికుమార్, ఆకుల వెంకటరమణ, రైతు నాయకులు చిక్కం పెద్దబ్బులు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ తదితరులు కాటన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు కాటన్ జయంతి సందర్భంగా మండలంలోని పలుచోట్ల నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.శ్రీపల్లవి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్, స్థానిక అక్విడెక్టు వద్ద హెడ్‌వర్క్స్ జేఈ ఎ.నాయుడు అధ్వర్యంలో కాటన్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మండల పరిషత్ ఏవో శర్మ, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల సత్యనారాయణ, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, ఆర్ఐ డాంగే, వీఆర్వోలు, మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని గురువారం ఆదుర్రు గ్రామంలో నిర్వహించారు. గ్రామంలోని ఏటిగట్టు వద్ద గల కాటన్ విగ్రహానికి సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు సర్ ఆర్థర్‌కాటన్ జయంతి సందర్భంగా పలువురు ఆయనకు నివాళులర్పించారు. గురువారం నల్లచెరువు గ్రామంలో గల కాటన్ విగ్రహానికి నివాళులర్పించి ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి బుజ్జి, రైతు ఉద్యమ నాయకుడు గణేశుల రాంబాబు, గ్రామ రైతులు రావూరి వెంకటరత్నం, గుండుమోగుల తాతాజీ, రావూరి ప్రభాకరరావు, గుర్రం నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్‌కు యానాంలోని అధికారులు, నాయకులు నివాళులర్పించారు. ఆయన జయంతిని యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులోని ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదలరసన్, ఎస్ఐ పూనిత్ రాజ్, శేరు నూకరాజు, యానాం సమాచారశాఖ అధికారి కెవిఎల్‌వి ప్రసాద్, మట్టపర్తి శ్రీను తదితరులు నివాళులర్పించారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన ఘనత సర్ ఆర్థర్ కాటన్‌కు దక్కుతుందని నీటి సంఘం అధ్యక్షుడు నామన నాగభూషణం అన్నారు. కాటన్ జయంతి సందర్భంగా గురువారం సఖినేటిపల్లి లాకుల వద్ద నీటి సంఘం ఆధ్వర్యంలో ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కందుల సూర్యచంద్రరావు, రుద్రరాజు ఆంజనేయరాజు, లాకు సూపరింటెండెంట్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్, (ఆంధ్రజ్యోతి): కోనసీమ నీటిపారుదల వ్యవస్థకు అప్పట్లోనే ఎంతో ముందు జాగ్రత్తతో సర్ ఆర్థర్ కాటన్ చేసిన రూపకల్పన నేటి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ మార్గ్ సమీపంలోని ఇరిగేషన్‌శాఖ ప్రాంగణంలో ఉన్న కాటన్ విగ్రహానికి గురువారం పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో గోకరకొండ నాగేంద్ర, ఏరియా కార్యదర్శి నూకల సత్యనారాయణ, శిష్లా శ్రీహరి, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, గోటేటి గంగాధర్, చింతలపూడి సత్తిబాబు, కుడుపూడి త్రినాథ్ తదితరులు కాటన్‌కు నివాళులర్పించారు.



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది



అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామంలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఈదురుగాలులతో కూడిన
భారీ వర్షం

మలికిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. గంటపాటు భారీగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గురువారం పడిన వర్షంతో ప్రజలకు కొంత ఉపశమనం ఇచ్చినా మామిడి, జీడి తోటల పంటలు నేలకొరిగాయని పలువురు రైతులు వాపోయారు. మోరి తదితర పల్లపు రోడ్లు నీట మునిగాయి. గాలివానకు పలు చోట్ల కొబ్బరి, తాడిచెట్లు నేలకొరిగాయి.

సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

మామిడికుదురు, మే 15(ఆంధ్రజ్యోతి): ఆదుర్రు గ్రామంలో గురువారం లూటుకుర్రు పీహెచ్‌సీ సిబ్బంది సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని ఎస్టీ ఏరియాలో 26 మందికి పరీక్షలు చేసి వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. సికిల్ సెల్ ఎనీమియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

మామిడికుదురు, మే 15(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం అప్పనపల్లిలో మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. స్థానికులు సమకూర్చిన దుస్తులను పేదలకు అందించారు. దేశ సరిహద్దులో బాధ్యతలు నిర్వహిస్తున్న సైనికుడు పెద్దిరెడ్డి శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తుండూరి బుజ్జి, మందా గాంధీ, తులా బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి
ఆర్థికసాయం

మామిడికుదురు, మే 15(ఆంధ్రజ్యోతి): తమతో చదువుకుని మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. కొమరాడ గ్రామానికి చెందిన దాసరి రమేష్ ఇటీవల మరణించగా 2004-07 వరకు డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.50 వేలు ఆర్థికసాయంగా అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో నాటి అధ్యాపకుడు రుద్ర శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు యేడిద నాగేశ్వరరావు, రుద్ర స్వామి నాయుడు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం
కొనుగోలు చేయండి

మంత్రి నాదెండ్లను కలిసి విజ్ఞప్తి చేసిన ఎంపీ హరీష్

అమలాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రబీ సీజన్‌లో మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కోరారు. గురువారం విజయవాడలో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో భేటీ అయిన ఆయన ఒక వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. రైతుల పక్షపాతి అయిన ప్రభుత్వం వారికి అండగా నిలిచేందుకు మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మంత్రి ఆమోదం తెలపాలని కోరారు. ఇప్పటికే మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చిన మంత్రి మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే రైతుల ఇబ్బందులు కొంతమేర తీరతాయన్నారు. తను విజ్ఞాపనపై మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిర్ణయం తీసుకోవచ్చునని ఎంపీ హరీష్ తెలిపారు.



విజయవాడలో పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ హరీష్



కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్

లోవోల్టేజీతో తీవ్ర ఇబ్బందులు

కాట్రేనికోన, మే 15(ఆంధ్రజ్యోతి): లోవోల్టేజీ సమస్యతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లోవోల్టేజీ సమస్యలపై అప్పట్లో ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందించిన విద్యుత్ అధికారులు 8పీటీఆర్ కెపాసిటీకి పెంచి 5 పీటీఆర్ విద్యుత్‌ను మాత్రమే సరఫరా చేస్తున్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచినా లోవోల్టేజీ సమస్య యధాతథంగానే వుంది. వేసవి ఎండలకు తోడు లోవోల్టేజీ, కరెంటు కోతలతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రొయ్యలు, చేపల చెరువులకు కరెంటు వాడకంతో పాటు ఏసీలు పెరగడంతో విద్యుత్ వినియోగం మరింత పెరిగింది. లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం గతంలో పల్లంకుర్రులో కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు సమకూరినా స్థలాభావంతో పనులు నిలిచిపోయాయి. ఇటీవల పల్లంకుర్రులో మరో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చెయ్యేరు సబ్‌స్టేషన్‌లో 8మెగావాట్స్ పీటీఆర్‌లు రెండు, కాట్రేనికోనలో 8మెగావాట్స్ పీటీఆర్ ఒకటి, 5మెగావాట్ల పీటీఆర్ ఒకటి ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన 8 మెగావాట్ల పీటీఆర్లను 5 పీటీఆర్ కెపాసిటీలో ఉంచడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి వేడిమికి ఉక్కిరిబిక్కిరవుతున్న వేళ కరెంటు కోతలు తప్పడంలేదు.

సిబ్బంది కొరత

కాట్రేనికోన సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజనీరు ఏఈ బాధ్యతలను తీసుకున్నారు. చిర్రయానాం ఏఎల్ఎం బదిలీపై వెళ్లారు. ఇప్పటికీ ఆ గ్రామానికి ఏఎల్ఎం నియామకం జరగలేదు. కాట్రేనికోనలో ఏఎల్ఎం బదిలీపై వెళ్లి ఎనిమిది నెలలయ్యింది. గెద్దనపల్లి, నడవపల్లి, బలుసుతిప్ప ఏఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యుత్ సమస్యలు ఎదురైతే పరిష్కరించే నాథుడు లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ట్రాన్స్‌కో ఏఈ వివరణ

లోవోల్టేజీ సమస్య మా దృష్టికి వచ్చింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాము. పీటీఆర్‌లు కొత్తగా వేసినందున పవర్ పెంచవలసి ఉందన్నారు.



ప్రత్యేక అలంకరణలో మాణిక్యాలమ్మ అమ్మవారు

వైభవంగా మాణిక్యాలమ్మ జాతర

పి.గన్నవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): వాడ్రేవుపల్లి గ్రామదేవత మాణిక్యాలమ్మ అమ్మవారి జాతర వైభవంగా ప్రారంభమైంది. గురువారం అమ్మవారికి గ్రామంలోని మహిళలు 108 కలశాలతో నదీజలాలను తీసుకువచ్చి అభిషేకం చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. రాత్రి డప్పుల వాయిద్యాలు, గరగనృత్యాలతో అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. దత్తాత్రేయ కనస్ట్రక్షన్ తరఫున పట్నాల దత్తాత్రేయ పూజా సామగ్రిని అందించారు. ఆలయంలోని యువ భట్టాచార్య, పెద్దింటి సాయి, రామకృష్ణమాచార్యులు కుంకుమ పూజలు జరిపించారు.



బోడసకుర్రు సమీపంలో బోల్తాపడిన వ్యాన్

ఐషర్ వ్యాన్ బోల్తా

అమలాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై అల్లవరం మండలం బోడసకుర్రు సమీపంలోని మేకలకాల్వ వంతెన వద్ద ఐషర్ వ్యాన్ బోల్తా పడింది. వర్షం సమయంలో వ్యాన్ అదుపు తప్పి పక్కకు పడిపోయింది. ప్రాణనష్టం లేకపోవడంతో పలువురు ఊపిరిపీల్చుకున్నారు.

తాటాకిల్లు దగ్ధం

రావులపాలెం, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక తాటాకిల్లు దగ్ధమైన ఘటనలో రూ2లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన సోమిశెట్టి వెంకట్రావు కుటుంబంతో తాటాకింట్లో నివసిస్తున్నాడు. గురువారం ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగి తాటాకింటికి నిప్పంటుకుంది. దీంతో ఇంట్లోని గృహోపకరణాలు, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

సాగునీటి కాల్వల ఆధునికీకరణపై సమీక్ష



మండపేటలో ఇరిగేషన్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే

మండపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి, మురుగుకాల్వలు ఆధునికీకరణకు సంబంధించిన అంశాలపై ఇరిగేషన్‌శాఖకు చెందిన అధికారులతో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం సమీక్ష నిర్వహిచారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మం డపేట నియోజకవర్గానికి సంబంధించి ఉన్న సాగునీటిసంఘాల వారంతా వారి పరిధిలో వున్న కాల్వలు, డ్రైన్లను దగ్గరుండి పర్యవేక్షించుకోవాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో పంటకాల్వల మరమ్మతులకు సంబంధించి రూ 1.16 కోట్లు, మురుగు కాల్వలు మరమ్మతులకు రూ 1.19 కోట్లు మంజూరయ్యాయని ఇరిగేషన్ అధికారులు వేగుళ్లకు వివరించారు. ఇరిగేషన్ అధికారులతోపాటు సాగునీటి సంఘాల అధ్యక్షుడితోపాటు టీడీపీ నేతలు ఎస్.వీర్రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జీ, చింతపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలాంత్రంలో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కె.గంగవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాంత్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దంగేరు గ్రామ సత్యసాయి సేవా సంస్థ వారు దీన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో పలుగ్రామాలకు చెందిన 100 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ఎంబీఆర్ శర్మ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి సాంబ శివరావు, సత్యసాయి సేవా సంస్థల దంగేరు జోన్ కన్వీనర్ ఆర్. నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు కొండబాబు, తదితర సేవాదళ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'పిల్లలకు అభ్యసన చేయించాలి'



వెదురుమూడిలో ప్రీ స్కూల్ సంసిద్ధతను వివరిస్తున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

కపిలేశ్వరపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న వస్తువులతో పిల్లలకు అభ్యసన చేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ప్రీ స్కూల్ సంసిద్ధతకు తల్లిదండ్రులకు వివరించారు. గురువారం మండలంలోని వెదురుమూడి బీసీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో సంసిద్ధత ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా వేసవి సెలవుల్లో పిల్లలకు మనోవికాసానికి సంబంధించి వారి తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు యాక్టివిటీస్ నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలో తొమ్మిది అంశాలతో కూడిన ప్రీస్కూల్ విద్యను వారి తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలచే చెప్పించారు. శ్రమస్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఈశ్వరి మాట్లాడుతూ క్రై బెంగుళూరు వారి సహకారంతో సన్‌నెట్‌వర్క్ పిల్లలకు ఇచ్చిన ప్రీ స్కూల్ మెటీరియల్ వినియోగించి సంసిద్ధత కార్యక్రమాలు చేపట్టడం సంతోషదాయకమన్నారు.ప్రథమ సంస్థ కోఆర్డినేటర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రీ స్కూల్ రెడీనెస్‌కు అంగన్‌వాడీల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎం.జానకీదేవి, వివిధ కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపెద్దలు, శ్రమస్వచ్ఛంద సంస్థ టీం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాణిక్యాలమ్మ జాతర మహోత్సవాలు

పి.గన్నవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): వాడ్రేవుపల్లి గ్రామదేవత మాణిక్యాలమ్మ జాతర మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి గ్రామంలోని మహిళలు 108 కలశాలు, నదీ జలాలతో అభిషేకం చేశారు.

అపరభగీరథుడు .. సర్ ఆర్దర్ కాటన్





మండపేట బైపాస్‌రోడ్డులో కాటన్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, పసలపూడిలో నివాళి అర్పిస్తున్న నేతలు

మండపేట, మే 15(ఆంధ్రజ్యోతి): కరువులో ఉండే ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపరభగీరథుడు సర్ ఆర్దర్ కాటన్ అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన జయంతిని పురస్కరించుకుని మండపేట బైపాస్‌రోడ్డులో వున్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అలాగే తాపేశ్వరం లాకులవద్ద, కేశవరం కెనాల్ రోడ్డులో వున్న కాటన్ విగ్రహాల వద్ద స్థానిక నేతలు, అధికారులు నివాళి అర్పించారు.

రాయవరం: సర్‌ఆర్దర్ కాటన్ జయంతిని పసలపూడిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. రామచంద్రపురం డీసీ కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి మాట్లాడూతు గోదావరి కరువు జిల్లాలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో డీసీ వైస్ ఛైర్మన్ బిక్కిన జగన్నాధరావు, చెల్లూరు సాగునీటి సం ఘం అధ్యక్షుడు బలుసు వీర వెంకట సత్యనారాయణచౌదరి, పసలపూడి టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మల్లిడి సూరారెడ్డి, మాజీ ఎంపీటీసీ, నల్లమిల్లి వెంకన్నబాబు, నల్లమిల్లి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని యర్రపోతవరంలో సర్ ఆర్దర్ కాటన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపంపిణీ సంఘం అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న యర్రపోతవరం లాకులను టీడీపీ సీనియర్‌నేత వాసంశెట్టి సత్యంతో కలిసి పరిశీలించారు. సమస్యలు విన్న సత్యం లాకులు అభివృద్ధికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లిపూడి బుజ్జి, రాయపురెడ్డి సీతారామయ్య, నీలా శ్రీనివాసు, ఇళ్ళ గోవింద రాజు, దంగేటి సుబ్బారావు, దూడల రామచంద్ర రావు, వాసంశెట్టి వెంకట రమణ, వాసంశెట్టి కృష్ణ, నిడదవోలు రవి, తదితరులు పాల్గొన్నారు.



యర్రపోతవరంలో కాటన్‌దొర విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

తేనెటీగల దాడి.. అస్వస్థతకు గురైన శ్రామికులు

కపిలేశ్వరపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకోరుమిల్లిలో గ్రామీణ వికాస్ శ్రామికులు ఉపాధి హామీ పనులు నిర్వహిస్తుండగా తేనెటీగలు దాడిచేయడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. గురువారం శ్రీరాంపురం వద్ద ఏటిగట్టుపై తుప్పలు తొలగిస్తుండగా తేనెటీగపుట్ట కదిలి శ్రామికులపై దాడి చేశాయి. దీంతో కొండమూరి ఏసు అనే శ్రామికుడిని వెంటనే కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ బాధితునికి చికిత్స అందించగా, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు, మరో రెండు రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆత్రేయపురం, మే15 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై, జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఆత్రేయపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ర్యాలీ గ్రామానికి చెందిన సంగిరెడ్డి దుర్గాప్రసాద్ (25) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన ఈయన జీవితంపై విరక్తితో మద్యంలో బుధవారం పురుగుమందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్సకోసం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

అసౌకర్యాల నడుమ ఉపాధి హామీ పనులు

- శ్రామికులకు తాగునీరు, టెంట్లు కరువు
- పట్టించుకోని అధికారులు

కపిలేశ్వరపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులు అసౌకర్యాల నడుమ జరుగుతున్నాయి. కపిలేశ్వరపురం, వెదురుమూడి, కోరుమిల్లి, తదితర గ్రామాల్లో చెరువుపూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. కపిలేశ్వరపురం రావులచెరువులో ఈనెల 5న ప్రారంభమైన పూడికతీత పనులు 4.5 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల పనిదినాలు ... ఏడు లక్షల అంచనా వ్యయంతో జరుగుతున్నాయి. అయితే పనుల నిర్వహణలో శ్రామికులకు తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు, ఎండవేడిమికి కనీసం టెంట్లు ఏర్పాటు కూడా చెయ్యకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారానికి ఒకసారి ఏఎన్ఎంలు వచ్చి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు, మార్చి నెల నుంచి ఇంతవరకు తమకు బిల్లులు చెల్లించలేదని పలువురు శ్రామికులు తెలిపారు.ఏపీఎం ఇన్‌చార్జ్, టెక్నికల్ అసిస్టెంట్ రజిత్ సింగ్‌ను దీనిపై వివరణ కోరగా సమస్యలు పట్ల ప్రభుత్వం స్పందించాల్సి ఉందన్నారు.



కపిలేశ్వరపురంలో ఎండలోనే చెరువు పూడికతీత పనులు చేస్తున్న శ్రామికులు

ఏపీటీఫ్ నాయకుడు యేలేటి మృతి



యేలేటి వెంకట్రాజు (ఫైల్)

ఆలమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి):ఆలమూరు మండలం పెదపళ్లకు చెందిన పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు యేలేటి వెంకట్రాజు బుధవారంరాత్రి మృతి చెందారు. ఆలమూరు మండలంలోని పలు గ్రామాలలో సుదీర్ఘకాలంపాటు ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ ద్వారా అనేక ఉద్యమాలు చేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా ఏపీటీఎఫ్‌లో పనిచేశారు. పదవీ విరమణ అనంతరం ఉపాధ్యాయులకు అండగా నిలిచేవారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారంరాత్రి ధవళేశ్వరంలో మృతి చెందారు. ఏపీటీఎఫ్ నాయకుడు వెంకట్రాజు మృతిపట్ల పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతపం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



టి.వెంకటేశ్వరరావు

ఆత్రేయపురం, మే 15(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందాడు. ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు(58) గురువారం గ్రామంలోని కాలువ పనులు చేసేందుకు వెళ్లాడు. ఉదయం పనిచేస్తుండగానే గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఏపీవో విజయరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని శ్రామికుని వివరాలు తెలుసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. సర్పంచ్ జ్ఞానమంగాయమ్మఅంజిబాబు మృతదేహాన్ని పరిశీలించి సంతాపాన్ని వ్యక్తం చేశాడు.

తాటాకిల్లు దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తినష్టం

రావులపాలెం, మే 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక తాటాకిల్లు దగ్ధమైన ఘటనలో రూ.2లక్షలు ఆస్తినష్టం సంభవించింది. రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన సోమిశెట్టి వెంకట్రావు కుటుంబంతో తాటాకింట్లో నివసిస్తున్నాడు. గురువారం ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగి తాటాకింటికి నిప్పంటుకుంది. దీంతో ఇంట్లోని గృహోపకరణాలు, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి. రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించిన్నట్లు బాధితుడు తెలిపాడు.



దగ్ధమైన తాటాకిల్లు

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.3.62లక్షలు

ఆత్రేయపురం, మే 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,62,369 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవననిర్మాణానికి అమలాపురానికి చెందిన కంచెర్ల నాగవీరవెంకట సత్యనారాయణ -సూర్యలక్ష్మి దంపతులు రూ.1.28లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్‌స్క్వాడ్ పోలీసులు


ఆలయంలో ... విస్తృత తనిఖీలు

కోనసీమ తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ పరిసరాల్లో గురువారం యాత్రికుల భద్రత దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఆత్రేయపురం ఎస్.ఐ నేతృత్వంలో అమలాపురం బాంబ్ స్కాడ్ ఆలయాన్ని అణువణువున తణిఖీలు చేశారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో కలియుగ దైవం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా యాత్రికులు రద్దీ ఉండే ఆలయాలవద్ద తనిఖీలు నిర్వహించినట్లు ఎస్.ఐ.రాము తెలిపారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు భద్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలో భాగంగా తనిఖీలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఘనంగా కాటన్ జయంతి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 15(ఆంధ్రజ్యోతి): గురువారం పట్టణంలో నీటిపారుదలశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాటన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం తదితరులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం లస్కర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఆలమూరు, మే 15(ఆంధ్రజ్యోతి): సర్ ఆర్థర్ కాటన్‌దొర జయంతి వేడుకలు ఆలమూరు మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గుమ్మిలేరు, చింతలూరు, జొన్నాడ, పెనికేరు, చొప్పెల్ల గ్రామాలలో కాటన్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాలర్పించారు. కాటన్ కరుణాకటాక్షాలతో గోదావరిజిల్లాలను సశ్యమలం చేసి మహానుభావుడని పలువురు ఆయన సేవలను కొనియాడారు.



రామచంద్రపురంలో కాటన్ మహాశయునికి నివాళి అర్పిస్తున్న పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు

19న రామచంద్రపురంలో జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే15 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో చంద్రబాబు ఉపాధి కార్యాలయంలో సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ ప్రకటనలో పేర్కొన్నారు. ఏషియన్ ఆటో పార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, నీమ్రానా స్టీల్ సర్వీస్ సంస్థల్లో ఆపరేటర్ల పోస్టులకు నియామకాలు జరుగుతాయని మంత్రి కార్యాలయం తెలిపింది. ఏషియన్ ఆటో పార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేయడానికి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో చదివిన 18 నుంచొ 30 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులని పే ర్కొన్నారు. నిమ్రానా స్టీల్ సర్వీసెస్ సంస్థల్లో పనిచేయడానికి 10వ తరగతి నుంచి డిగ్రీ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాను వినియోగించుకోవాలని కోరారు.

జొన్నాడలో పూర్వపు విద్యార్థుల కలయిక

ఆలమూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక గురువారం జరిగింది. ఈ పాఠశాలలో 2007-2012లో ఆరు నుంచి పది వరకు చదువుకున్న విద్యార్థులు కలుసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. తాము చదువుకున్న పాఠశాల ఆవరణ, తరగతి గదులలో పాత తీపీ జ్ఞాపకాలను నేమరు వేసుకుంటూ సరదా సరదాగా గడిపారు. అనంతరం చదువుచెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. పూర్వపు విద్యార్థులను ఒకచోటకు చేర్చడంలో పూర్వపు విద్యార్థులు పూర్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, సూర్యచంద్ర, వీరబాబు, సుదీర్‌కుమార్ కీలకపాత్ర పోషించారు. ఈసందర్భంగా పాఠశాలకు వాటర్‌కూలర్‌ను అందజేశారు.



జొన్నాడ జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

ఉపాధి కూలీల సమక్షంలో బండారు జన్మదిన వేడుకలు

ఆలమూరు, మే 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధి కూలీల సమక్షంలో కూటమి నాయకులు కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్వీట్స్, కూల్ డ్రింక్స్, మజ్జిగలను అందించారు. ఉపాధి శ్రమికులు సమక్షంలో సంధిపూడి, ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల, చింతలూరు, జొన్నాడ, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి, నవాబుపేట, పెనికేరు గ్రామాలలో ఉపాధి కూలీల సమక్షంలో కేక్‌లు కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

కొత్తపేట: మండలంలో పలు గ్రామాల్లో భారీ కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరిపారు. వాడపాలెంలో సర్పంచ్ త్సామా బాబు ఆధ్వర్యంలో బండారు జన్మదిన వేడుకలు జరిపారు. అలాగే కొత్తపేటలో సర్పంచ్ బూసి జయలక్ష్మి ఆధ్వర్యంలో బండారు జన్మదిన వేడుకలు జరిపి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే టీడీపీ నాయకుడు గుబ్బల మూర్తి ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కేక్‌ను కట్ చేయించి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు ధర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీను, విళ్ళ మారుతీప్రసాద్, యల్లమిల్లి జగన్మోహన్, వాసంశెట్టి సత్యనారాయణ, ముద్రగడ సుబ్బారావు, బండారు బుల్లి తాత, బండారు ధనరాజు, పప్పుల కొత్తయ్య, కడియం భాస్కర్, పప్పుల బుజ్జి,మిద్దే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావు పుట్టినరోజు వేడుకలను రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండలశాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, చిన్న కేవీ, కోట వెంకటేశ్వరరావు, జక్కంపూడి వెంకటస్వామి, నెక్కంటి వెంకన్న, ఆనందరావుతోపాటు పార్టీ శ్రేణులు కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేశారు.

ఆత్రేయపురం: కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జన్మదినం సందర్భంగా ముఖ్యకూడలిలో ఆయన అభిమానులు భారీ స్థాయిలో ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. యువత బైక్ ర్యాలీ నిర్వహించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పులిదిండి, తాడిపూడిలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉపాధి శ్రామికుల సమక్షంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉపాధి శ్రామికులకు అందజేశారు. ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూటమి నాయకులు రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు అందిస్తున్న దృశ్యం



వాడపాలెం సర్పంచ్ త్సామా బాబు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు